ప్రజాశక్తి

శుక్రవారం 11 ఆగస్టు 2023 | 5 | అనంతపురం

విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేస్తున్న కలెక్టర్

నులిపురుగులను నిర్మూలిద్దాం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

చిన్నారుల ఆరోగ్యానికి, వారి ఎదుగుదలకు హానికరంగా మారిన నులిపురుగులను సమూలంగా నిర్మూలించేందుకు అందరూ కృషి చేద్దామని కలెక్టర్ ఎం.గౌతమి పిలుపునిచ్చారు. గురువారం నాడు అనంతపురం నగరం అరవింద్ నగర్‌లో ఉన్న శ్రీకష్ణదేవరాయ కార్పొరేషన్ మున్సిపల్ హైస్కూల్లో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ ఎం.గౌతమి హాజరై అల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లలే దేశ సంపదకు చిహ్నం అన్నారు. విద్యార్థి దశ నుంచే ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెలకొల్పాలన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి 1 - 19 సంవత్సరాల వయసున్న అందరు పిల్లలకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని సూచించారు. అన్ని పాఠశాలల్లోనూ వీటిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ తరపున అల్బెండజోల్ మాత్రలను పిల్లలందరికీ పంపిణీ చేస్తున్నామన్నారు. పిల్లలు అందరూ తప్పనిసరిగా ఈ మాత్రలను వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్మిక సంఘం ప్రతినిధి చవ్వా రాజశేఖర్ రెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ యుగంధర్, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, డిఇఒ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

కళ్లకలక కలవరం

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కేసులు
- చిన్నారులపై అధిక ప్రభావం
- వాతావరణ పరిస్థితులే కారణం
- జాగ్రత్తలు అవసరం అంటున్న వైద్యులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత వారం తేలికపాటి వర్షాలు పడ్డాయి. గత రెండు రోజులుగానూ అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పలు అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఇందులో ప్రస్తుతం కళ్లకలక వైరస్ జనాన్ని కలవర పెడుతోంది. ఈ సీజన్‌లో ప్రస్తుతం ఈ కేసులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా దీని ప్రభావం చిన్నారులపై ఎక్కువగా పడుతోంది.

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవలి కాలంలో కళ్లకలక కేసులు పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వర్షాల కారణంగా కండ్లకలక వంటి కంటి ఇన్ఫెక్షన్‌లు రావడం సహజమే అయినా, ఈ సారి దీని తీవ్ర ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. కళ్లకల జబ్బుతో ఆసుపత్రికి వెళ్లే వారి సంఖ్య పెరుగుతోంది. కళ్లకల వైరస్‌కు ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే లక్షణం ఉండడంతో రోజురోజుకు దీని బాధితుల సంఖ్య పెరుగుతున్నారు. పాఠశాలల్లో కళ్లకలక బారిన పడిన చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. వాతావరణంలో మార్పులు, కెమికల్ రియాక్షన్, రసాయనాలు, వాహనాల పొగ, సౌందర్య ఉత్పత్తులు వాడకం, దుమ్ము, ధూళి, పెంపుడు జంతువులు, పుప్పొడి వల్ల కళ్ల కలక వస్తుందని వైద్యులు చెబుతున్నారు. అనంతపురంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో ఒక తరగతిలోనే దాదాపు 15 మంది విద్యార్థులు ఈ వైరస్ బారిన పడ్డారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వర్షాలు ఇలానే వస్తే కళ్లకలక వైరస్ బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ కళ్ల కలకల బాధితులతో ఒపి పెరిగింది. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో అధికంగా ఉన్న ఈ వైరస్ పల్లెకు ప్రాకే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కళ్లకలక లక్షణాలు

- కళ్లకలక వచ్చిన వారి కళ్లుఎరుపు రంగులోకి మారుతాయి.
- దురద, నీటితో నిండిన కళ్లు ఉంటాయి.
- నొప్పి, వాపు వంటి లక్షణాలు కన్పిస్తాయి.
- ఈ వైరస్ బారిన పడ్డవారిలో కొందరికి జలుబు, దగ్గు, జ్వరంతో లక్షణాలు కూడా ఉంటాయి.

జాగ్రత్తలు...చికిత్సా పద్ధతులు..!

- కళ్లకలక సులువుగా ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుంది. కాబట్టి దీనిబారినపడ్డ వారు ఒంటరిగా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.
- కాంటాక్ట్ లెన్సులు వాడటం మానేయాలి. బయటకు వెళ్లాల్సి వస్తే కళ్లజోడు పెట్టుకుంటే మంచిది.
- నీరు తాగితూ.. హైడ్రేటెడ్‌గా ఉండాలి.
- కళ్లకలక లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- అతిక మోతాదు డ్రాప్స్ వేసుకోవడం అంత మంచిది కాదు.
- వైద్యుని సలహా మేరకు కంటి చుక్కలు లేదా లూబ్రికెంట్లను ఉపయోగించాలి.
- కళ్లపై నీళ్లను చిమ్మిస్తూ, శుభ్రం చేసుకుంటూ ఉండాలి.

చూసినంత మాత్రాన రాదు..!

ఈ వ్యాధి ఉన్న వారి కళ్ల ల్లో కళ్లు పెట్టి చూసినంత మాత్రాన ఇది వ్యాపించదు. వారు వాడిన జేబురుమాళ్లు పట్టుకోవడం, తలగడలపై పడుకోవడం.. వాళ్లు కళ్లల్లో పెట్టుకున్న చేతులను మరొకరు పట్టుకుంటే వ్యాధి వ్యాప్తి చెందుతుంది. కళ్లల్లో చేతులు పెట్టుకోకుండా ఉంటే 90 శాతం ఈ వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చు. వైద్యుల సూచనల మేరకు యాంటీబయాటిక్ ఐ డ్రాప్స్ వేసుకుంటే సరిపోతుంది. ప్రస్తుతం కళ్లకలక వ్యాధి చిన్నారుల్లో ఎక్కువగా ఉంది. పాఠశాలల్లో ఒకరి నుంచి మరొకరికి సులభంగా వ్యాపించే అవకాశం ఉంది. నిరంతరం వారు చేతులు శుభ్రం చేసుకునేలా చూడాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ చేతులు కంట్లో పెట్టుకోకుండా ఉండాలని సూచించాలి. పగలు ఎక్కువసార్లు ఐడ్రాప్స్ వేసుకోవడంతో పాటు రాత్రి సమయాల్లో వేపకాయ చూట్‌గా పిలిచే డ్రాప్స్ వేసుకుంటే మంచిది. ఇంట్లో వారికి కళ్ల కలక ఉంటే వారు వినియోగించినవి మిగిలిన వారు వాడకూడదు.

డాక్టర్ లావణ్య,
పిహెచ్‌సి వైద్యాధికారి, చుక్కలూరు.

ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

యుటిఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయ వద్ద యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించి గౌరవవందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహలను ముఖ్య ఉద్దేశాలతో ఆగస్టు 10, 1974వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్థాపించడం జరిగిందన్నారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు అనేక రకాల ఉద్యమాలు చేస్తూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తూ, విద్యారంగ పరిరక్షణకై పోరాటాలు కొనసాగించిందన్నారు. మేధావి వర్గంతో కలిసి గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలను గెలిపించుకోవడం జరిగిందన్నారు. వారి ద్వారా రాష్ట్రంలోని విద్యా రంగం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కౌన్సిల్లో అనేక సమస్యలు పరిష్కరించిందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్ష సభ్యత్వం కలిగిన ఏకైక సంఘంగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ముందుంటుందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాలతో ఉపాధ్యాయులపై అనేక రకాలుగా వేధింపులకు గురి చేస్తూ, విద్యా రంగాన్ని చిన్నాభిన్నం చేస్తోందన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధ్యాయుల వేధింపులు తగ్గించాలని, విద్యారంగా సమస్యలను పరిష్కరించాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లింగమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.గోవిందరాజులు, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె.నాగేంద్ర, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, రోగప్ప తదితరులు పాల్గొన్నారు.

సెబ్ పోలీసులపై దాడి దుర్మార్గం : సిపిఎం

అనంతపురం కలెక్టరేట్ : అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన సెబ్ పోలీసులపై దాడి చేయడం దుర్మార్గంగా ఉందని సిపిఎం నగర 2వ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు డిమాండ్ చేశారు. గురువారం సెబ్ పోలీసులపై జరిగిన దాడిని సిపిఎం నగర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నగరంలోని నవోదయ కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డ గుజ్జల సురేష్‌ను సెబ్ అధికారులు అరెస్టు అతన్ని వదిలేయాలని పోలీసులపై దాడులకు పాల్పడటం అధికార పార్టీ నాయకులు సిగ్గు చేటుగా ఉందన్నారు. అరెస్టును సమర్థించాల్సిన అధికార పక్ష నాయకులు సమర్థించకుండా అధికారపక్ష కార్పొరేటర్లు సాకే చంద్రశేఖర్, కమల్ భూషణ్ ఇద్దరూ కలిసి తమ గుండాలతో సెబ్ పోలీస్ స్టేషన్‌పై దాడి చేయడం అన్యాయంగా ఉందన్నారు. సెబ్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ అందరిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నాలుగున్నర సంవత్సరాలలో అనంతపురం నగరంలో అధికారులను ఎవరిని ప్రశాంతంగా ఉద్యోగం చేయనివ్వడం లేదన్నారు. అనంతపురం నగర ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ఇప్పటికైనా స్పందించి వారి అనుచరులను హద్దుల్లో పెట్టుకోవాలన్నారు. పోలీసులు అధికార పక్షానికి ఒక రకంగా ప్రతిపక్షాలకు మరొక రకంగా వారి చేష్టలు ఉండటం బాధాకరం అన్నారు. వెంటనే సెబ్ పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన కార్పొరేటర్లు సాకే చంద్రశేఖర్, కమల్ భూషణ్‌లు ఇద్దరినీ నాన్ బెయిల్ కేసులు పెట్టి అరెస్టు చేయాలన్నారు.

నకిలీ మిరపనారతో నష్టం

ఎదుగదల లేని పంట - నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

పైరుపెరగకుండా ఎండిపోతున్న మిరపపంట

నకిలీ నర్సరీల్లో విక్రయిస్తున్న పైరుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎన్నో ఆశలతో పంట సాగు చేస్తే మొక్కలు ఎండిపోతుండడం రైతుల గుండెను పిండిచేస్తోంది. బొమ్మనహాల్ మండలంలో ఇటీవల మిరప రైతులకు ఇలాంటి కష్టాలే వెంటాడుతున్నాయి. స్థానికంగా కొన్ని నర్సరీలు నకిలీ పైరును విక్రయించడంతో దానిని నాటినా ఎదుగదల లేకపోవడంతో ఎకరాకు రూ.30 వేల వరకు రైతులు నష్టపోవాల్సి వచ్చింది. మండల పరిధిలోని బొమ్మనహాల్, కురువల్లి, చంద్రగిరి, దేవగిరి, గోవిందవాడ, బొల్లనగుడ్డం, కళ్లుదేవనహళ్లి, కృష్ణాపురం, ఎల్బీనగర్ గ్రామాలకు చెందిన రైతులు మండలంలోని ఓ ప్రయివేటు నర్సరీ నుంచి మిరప మొక్కలను కొనుగోలు చేశారు. ఒక్కో మొక్క ఒక రూపాయి ప్రకారం 16 వేల మొక్కలను కొనుగోలు చేసి మిరపను నాటారు. పైరు నాటి 20 రోజులు అవుతున్నా మొక్క ఎదగకుండా అలానే ఉండిపోయింది. తరువాత ఎండిపోయింది. దీంతో రెండోసారి మళ్లీ 16 వేల మొక్కలను తెచ్చి నాటారు. ఇది కూడా అంతంత మాత్రంగానే ఎదుగదల కన్పిస్తోంది. దీంతో మిరప రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నర్సరీలో నాణ్యమైన పైరును విక్రయించకుండా వ్యాపారులు మోసం చేస్తున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎకరా మిరపను నాటాలంటే 16 వేల మొక్కలు అవసరం అవుతాయి. మళ్లీ దీనికి ఎరువులు, రసాయన ముందుల పిచికారీకి అదనంగా దాదాపు రూ.30వేల వరకు డబ్బులు ఖర్చు చేయాలి. ఇంత ఖర్చు చేసినా పైరు మొక్క దశలోనే ఎండిపోతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నకిలీ పైరుతో మిరప రైతులు నష్టపోతున్నా వ్యవసాయ అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించిన దాఖలాలు లేవు. కనీసం ఎందుకు పైరు ఇలా ఎండిపోతోందన్న విషయాన్ని కూడా పరిశీలించి చెప్పే అధికారి లేరంటూ రైతులు వాపోతున్నారు. ఓ వైపు నకిలీ పైరు, మరో వైపు అధికారుల నిర్లక్ష్యంతో మిరప రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయ అధికారులు మాత్రం దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే ఇలాంటి సమస్య తమ దృష్టికి రాలేదంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యం వీడి నకిలీ పైరును విక్రయించి మోసం చేస్తున్న నర్సరీలపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ముగిసిన నామినేషన్ల స్వీకరణ

పుట్లూరు : మండలంలోని చేర్లోపల్లి 1వ గ్రామ వార్డు స్థానానికి గురువారం చివరిరోజు రెండు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి యల్లమనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురం నాగలక్షుమ్మ, కె.రాజ్యలక్ష్మి చెరో నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఈ స్థానానికి ముగ్గురు నామినేషన్ వేసినట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి తెలిపారు.

యాడికి : మండలంలోని స్థానిక సంస్థల ఉప ఎన్నికలకు నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసినట్లు ఇఒఆర్‌డి వెంకటేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా యాడికి 19వ వార్డుకు 4, రాయలచెరువు 12వ వార్డుకు 2 , వెంగన్నపల్లి 5వ వార్డుకు 2, నగరూరు వార్డుకు 2 చొప్పున నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

నార్పల : మండల కేంద్రంలోని 8వ వార్డుతోపాటు మండల పరిధిలోని సోదనపల్లి 3, 5వ వార్డులకు ఆరు నామినేషన్లు దాఖలైనట్లు ఎంపిడిఒ కార్యాలయ పర్యవేక్షకురాలు ఉమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో సోదనపల్లి స్థానాలు ఏకగ్రీవం అయినట్లు తెలిపారు.

ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన కల్పించాలి

మాట్లాడుతున్న సివిల్ జడ్జి దీన

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలోని కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి దీన సూచించారు. గురువారం విజయనగర న్యాయ కళాశాలలో ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ర్యాగింగ్ కారణంగా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. ఈ చట్టంపై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ఐదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీలోని సీనియర్ న్యాయవాదులు ఎన్.హరికృష్ణ, జి.పద్మజ, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ యండ్లూరి ప్రభాకర్, విద్యావేత్త డాక్టర్ కోరాడ రామకృష్ణ ఉన్నారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ కె.శ్రీనివాసరావు, కళాశాల వ్యవస్థాపకులు ఎ.రామిరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రాఘవేంద్రచార్, వైస్ ప్రిన్సిపల్ ఎం.మహేష్, కళాశాల అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : టిడిపి

అనంతపురం కలెక్టరేట్ : సెబ్ పోలీసులపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి శిక్షించాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. అక్రమ మద్యం విక్రయదారులను అరెస్టు చేసిన నేపథ్యంలో జరిగిన దాడిని నిరసిస్తూ గుల్జార్‌పేటలోని సెబ్ పోలీస్ స్టేసన్ వద్ద టిడిపి నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి నగర అధ్యక్షుడు మారుతికుమార్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నాయకులు రాజారావు, సుధాకర్ యాదవ్, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, రాష్ట్ర నాయకురాలు తేజశ్విని హాజరై మాట్లాడారు. సెబ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐతో సహా మహిళా కానిస్టేబుల్ పైనే దాడి చేయడం సిగ్గుచేటన్నారు. పోలీసులపై దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోపాల్ గౌడ్, టైలర్ శీనా, రాయల్ రఘు, శిరీషాల రాంబాబు, అజీజ్, పూల బాషా, పరిమి రాజారావు, వెంకటేష్, వన్నూర్, బొమ్మినేని శివ, జేయం బాషా, పాల్గొన్నారు.

దళిత, గిరిజనులకు రక్షణ కరువు

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-శింగనమల

విలేకరులతో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప

రాజకీయ నాయకుల అండదండలతో దళిత, గిరిజనులపై దాడులు పేట్రేగిపోతున్నాయని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని రామస్వామి ఆలయంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా దళిత, గిరిజనులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. పుట్లూరు మండలం శనగల గూడూరులో పీర్లపండగలో చిన్న ఘటనకు దళిత యువకుడు సతీష్‌పై ఏడుగురు దాడి చేశారన్నారు. సంబంధిత యువకుడు పోలీస్‌స్టేషన్‌కి ఫిర్యాదు చేయడానికి వెళ్తే అక్కడ కూడా అగ్రవర్ణాల వారు దాడి చేశారన్నారు. దీనికితోడు దళితులపైనే కేసు నమోదు చేశారన్నారు. ఆఖరికి గ్రామ బహిష్కరణ కూడా చేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామంలో విచారించి దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం సహకార దర్శి భాస్కర్, కెవిపిఎస్ మండలాధ్యక్షుడు మేకల పెద్దన్న, దండోరా నాయకుడు చిన్న ఆంజనేయులు, ప్రజానాట్య మండలి శ్రీనివాసులు, ఆంజనేయులు, రాము, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మెనూ ప్రకారం భోజనం అందించాలి

బిసి సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి

ప్రజాశక్తి-అనంతపురం

భోజనాన్ని పరిశీలిస్తున్న బిసి సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి

హాస్టళ్లలో మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని బిసి సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి సూచించారు. గురువారం నగరంలోని బీసీ గర్ల్స్ ప్రీ మెట్రిక్ హాస్టల్‌లో జిల్లాలోని బీసీ హాస్టల్ వార్డెన్లు, వర్కర్లకు నూతన మెనూపై, జీఓ 46లోని అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ వంటలు బాగా నాణ్యతగా చేశారని అభినందించారు. అదేవిధంగానే అన్ని బీసీ హాస్టళ్లలో నూతన మెనూను పక్కాగా అమలు చేయాలన్నారు. అదేవిధంగా జీవో 46లోని అన్ని అంశాలపై అవగాహన చేసుకుని అమలు చేయాలన్నారు. అలాగే హాస్టల్లని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం సుభాషిని, తాడిపత్రి ఎబిసి డబ్ల్యూఓ రంగమ్మ, కళ్యాణదుర్గం ఎబిసి డబ్ల్యూఓ గంగాద్రి, బీసీ హాస్టల్ వార్డెన్ల సంఘం సీనియర్ నాయకులు మస్తాన్, జిల్లా అధ్యక్షులు మారుతి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌నాయుడు, కోశాధికారి కంబయ్య, డీడీ కార్యాలయం పర్యవేక్షకులు నాగరత్నమ్మ, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు

12న కలెక్టరేట్ ఎదుట 12 గంటల నిరసన

ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ సిరాజుద్దీన్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న 12 గంటల నిరసన దీక్షకు ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ ఎస్.సిరాజుద్దీన్, సెక్రటరీ జనరల్ లింగమూర్తి, నాయకులు గోవిందరాజులు, లింగమయ్య పిలుపునిచ్చారు. గురువారం ఉపాధ్యాయ భవన్‌లో నిరసన దీక్షకు సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యా రంగం సంక్షోభంలో పడిందన్నారు. ప్రభుత్వం శాస్త్రీయమైన విధానాల వలన ప్రభుత్వ పాఠశాలల నుంచి నాలుగు లక్షల మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం ప్రయివేటు పాఠశాలలకు వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమలు చేసిన జాతీయ విద్యా విధానం, 3,4,5 తరగతుల విలీనంతో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేక తరగతి గదులు వెలవెలబోతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరణ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తక్షణమే మార్కెట్ ధరలకు అనుగుణంగా 50 శాతం మధ్యంతర భతితో పిఆర్‌సి ప్రకటించాలన్నారు. ఆదర్శ పాఠశాలలకు 010 హెడ్ జీతాలు, పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ ఉన్నటువంటి 60 వేల మంది ఉపాధ్యాయుల రెండు నెలల జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ సర్వీస్ రూల్స్ ఆమోదింపజేసి ఉద్యోగోన్నతులు బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న నిరసన దీక్షకు ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఎన్.రమణారెడ్డి, సూర్యుడు, పెద్దన్న, రత్నం, ఎస్.రామాంజనేయులు, శంకర మూర్తి, సూర్య నారాయణ గౌడ్, జావేద్ అహమ్మద్, నాగన్న, గోపాలరెడ్డి పాల్గొన్నారు.

టిడిపి హయాంలోనే సాగునీటికి అధిక నిధులు

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుత్తి

టిడిపి ప్రభుత్వ హయాంలోనే సాగునీటి ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయించామని టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం చేపట్టిన యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు గురువారం గుత్తి చెరువును సందర్శించారు. ఇందులో భాగంగా చెరువు వద్ద సెల్ఫీ తీసుకుని వైసిపి నాయకులకు ఛాలెంజ్ విసిరారు. అనంతరం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. ఎందుకంటే ప్రభుత్వాన్ని కాంట్రాక్టర్లు నమ్మడం లేదన్నారు. ఇక ప్రజలు, రైతులు ఎలా నమ్ముతారన్నారు. 2014-19లో తమ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, నీరు చెట్టు పథకం కోసం రూ.68,293 కోట్లు వెచ్చించామన్నారు. వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లలో రూ. 22,650 కోట్లు మాత్రమే సాగునీటి వ్యవస్థ కోసం విడుదల చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ప్రజలు ఇంటికి సాగనంపుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆర్.జితేంద్ర గౌడ్, ప్రభాకర్‌చౌదరి, ఉన్నం హనుమంతురాయచౌదరి, టిడిపి నాయకులు ఉమామహేశ్వరనాయుడు, ఆర్.పవన్ కుమార్‌గౌడ్, వెంకటశివుడు యాదవ్, టిడిపి మండల, పట్టణ కన్వీనర్లు బర్దివలి, రవిశంకర్, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్‌చౌదరి, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మోడే శ్రీనివాస్‌యాదవ్, టౌన్‌బ్యాంకు ఉపాధ్యక్షుడు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి చెరువు వద్ద సెల్ఫీ దిగుతున్న టిడిపి నాయకులు

ఎఆర్ కానిస్టేబుల్‌కు ఎస్పీ నివాళి

కిరణ్‌కుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

నగర శివార్లలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎఆర్ కానిస్టేబుల్ యు.కిరణ్‌కుమార్‌కు ఎస్పీ శ్రీనివాసరావు నివాళులర్పించారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం స్థానిక సర్వజన ఆస్పత్రికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఎఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ట్రాఫిక్ సిఐ వెంకటేష్‌నాయక్, ఆర్‌ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజోనాథ్, తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ స్పాట్ గుర్తింపు

ఎఆర్ కానిస్టేబుల్ యు.కిరణ్ కుమార్ ప్రమాదానికి కారణమైన స్థలాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. ఇందులో భాగంగా డీజీ ఆర్‌ఎన్ అమ్మిరెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు గురువారం సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వేగ నియంత్రణ కోసం ఆ ప్రాంతంలోని రోడ్డుకు అటు ఇటు వాహనాలు తిరగకుండా బరన్ బారికేడ్లతో మూయించాలని ఆదేశించారు. కాషన్ బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, క్యాట్ ఐస్, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించారు. ఆ ప్రాంతంలోని జాతీయ రహదారి విజిబుల్ గా కనిపించేలా రహదారికి ఇరువైపులా పొదలను తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎఐ ఇంజినీర్లు, త్రీ టౌన్ సిఐ ధరణికిషోర్, ట్రాఫిక్ సిఐ వెంకటేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై కేసు నమోదు దుర్మార్గం

ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబుపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేయడం దుర్మార్గమైన చర్య అని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. గురువారం ఉరవకొండ టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతోందన్నారు. ఇది ఎంతోకాలం కొనసాగదన్నారు. ప్రాజెక్టుల సందర్శన కోసం ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు వెళ్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి భయం పట్టుకుందన్నారు. అందుకే ఆయనపై కేసులు నమోదు చేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ వ్యవస్థలపై గౌరవం, ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదన్నారు. చంద్రబాబు ఆలోచన విధానాలు రాష్ట్ర ప్రజలందరికీ 40 సంవత్సరాలుగా తెలుసు అన్నారు. అలాంటి వ్యక్తిపై కేసులు నమోదు శోచనీయమన్నారు. చరిత్రలో ఎంతోమంది హిట్లర్ లాంటి నియంతలు ఇలాంటి విధానాలను అవలంభించి కనుమరుగయ్యారని గుర్తు చేశారు.

శింగనమల : జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న వ్యక్తిపై 307 కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందని తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. అన్నమయ్య జిల్లా అంగళ్లు, పుంగనూరులో జరిగిన ఘటనలకు బాధ్యులను చేస్తూ చంద్రబాబుతోపాటు టిడిపి నాయకులు, కార్యకర్తలపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించడం దారుణమన్నారు. వెంటనే చంద్రబాబుతోపాటు టిడిపి నాయకులు, కార్యకర్తలపై కేసులను ఎత్తివేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బిటిపి నుంచి చెరువులకు నీరు

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

మ్యాప్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-బెలుగుప్ప

భైరవానితిప్ప ప్రాజెక్టు కెనాల్ నుంచి మండలంలోని చెరువులకు నీరు అందజేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని జీడిపల్లి నుంచి బిటి ప్రాజెక్టుకు నిర్మించతలపెట్టిన కెనాల్ రూట్ మ్యాప్‌ను గురువారం క్షేత్రస్థాయిలో వర్కర్లతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిపల్లి రిజర్వాయర్ నుంచి రాయదుర్గం నియోజకవర్గం భైరవానితిప్ప ప్రాజెక్టుకు హంద్రీనీవా నీటిని తీసుకువెళ్లే కెనాల్ ద్వారా మండలంలోని కోనాపురం, గంగవరం, శీర్పి, హనిమిరెడ్డిపల్లి గ్రామాల చెరువులకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా భూగర్భజలాలు పెరిగి బోరు బావుల్లో నీరు వృద్ధి చెందుతుందన్నారు. బెలుగుప్ప మండలాన్ని వ్యవసాయంలో హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. వచ్చే మార్చి నాటికి పనులు పూర్తి అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సహకార సంఘం అధ్యక్షుడు శివలింగప్ప, ఎంపిటిసి ప్రసాద్, నాయకులు త్రిలోక్‌రెడ్డి, అశోక్, గోపాల్, బాబు, కన్వీనర్ శ్రీనివాసులు, మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ డిఇ రమణ, ఏఇఇలు మల్లికార్జునరెడ్డి, మహేష్‌నాయుడు, సుదర్శన్, మునిరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

'చేయూత' మార్ట్‌లో బలవంతపు అమ్మకాలను ఆపాలి

మండల సమావేశంలో సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని చేయూత మహిళా మార్ట్‌లో బలవంతపు అమ్మకాలను ఆపాలని పలువురు సభ్యులు ఏకరువు పెట్టారు.గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నాగేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా సమావేశం 10 గంటలకు ప్రారంభమవగా 11 గంటలు అవుతున్నా అధికమంది అధికారులు హాజరుకాకపోవడంపై ఎంపిడిఒ అసహనం వ్యక్తం చేశారు. ఆలస్యంగా వచ్చిన అధికారుల నుంచి సంజాయిషీ కోరి తదుపరి సమావేశాలకు సమయ పాలన పాటించాలని హెచ్చరించారు. జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ మాట్లాడుతూ మండలంలోని పలు పాఠశాలల్లో కబడిన తరగతుల విద్యార్థుల పట్ల వివక్షత చూపుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఎంఇఒ కృష్ణయ్య తెలిపారు. వ్యవసాయ అధికారి చిన్న వీరాస్వామి మాట్లాడుతూ మండలంలో 1.40కోట్ల విలువజేసే విత్తన వేరుశనగను సుమారు నాలుగువేల మంది రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా మార్ట్‌లో మహిళా సంఘాల సభ్యులు నెలకు ఇన్ని సరుకులు కొని తీరాల్సిందేనంటూ బలవంతం చేస్తున్నారని వాపోయారు. అంతేగాకుండా ప్రతి వస్తువూ బయటికంటే అధిక ధరకు విక్రయిస్తున్నారన్నారు. దీంతో ఎపిఎంలు తిప్పమ్మ, శివకుమార్ బయట కంటే మార్టులో ధరలు తక్కువగానే ఉన్నాయన్నారు. ఎవరైనా సిబ్బంది బలవంతంగా మాటులో కొని తీరాలని ఒత్తిడి తెస్తే తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీరితోపాటు పలువురు సభ్యులు సమస్యలపై ఏకరువు పెట్టారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు వెంకటలక్ష్మి, మల్లేశ్వరయ్య, బండ్లపల్లి శంకర్ యాదవ్, రాజారెడ్డి, కాటమయ్య, పద్మాకర్‌రెడ్డి, శారద, వెంకట నారాయణమ్మ, సర్పంచులు సుప్రియ, లక్ష్మీదేవి, రమణకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ రవీందర్‌నాథ్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఎఇ సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రతి రైతూ సాగు చేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శుక్రవారం మండలంలోని కొండాపురంలో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలకు అర్హులవుతారన్నారు. లేకుంటే ప్రభుత్వ పథకాలు ఏవీ వర్తించవన్నారు. దీనివల్ల రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కావున రైతులు తప్పనిసరిగా సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎడిఎ రవి, మండల వ్యవసాయాధికారి శ్యాంసుందర్‌రెడ్డి, రైతు భరోసా కేంద్రం ఇన్‌ఛార్జి తిరుమలేష్, రైతులు పాల్గొన్నారు.

చీనీ మార్కెట్ పరిశీలన

చీనీ మార్కెట్‌ను పరిశీలిస్తున్న మార్కెట్ యార్డు కమిటీ ఛైర్మన్ ఫయాజ్, అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని మార్కెట్ యార్డులో చీనీ మార్కెట్‌తోపాటు ఈ-నామ్‌ను జాయింట్ డైరెక్టర్ రామాంజినేయులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎకెఎస్ ఫయాజ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీనీ పంటను దేశానికే ఎగుమతి చేస్తున్న ఘనత అనంత మార్కెట్‌కే దక్కుతుందన్నారు. అందుకోసమే వైసిపి అధికారంలోకి వచ్చాక గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా మార్కెట్‌లో రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డిడిఎం శ్రీకాంత్ రెడ్డి, ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి, మార్కెట్ యార్డు సిబ్బంది, రైతులు, వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

వైసిపి యువజన విభాగం జోనల్ ఛైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి

సీసీ రోడ్డు, డ్రెయినేజీకి భూమిపూజ చేస్తున్న వైసిపి యువజన విభాగం జోనల్ ఛైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైసిపి యువజన విభాగం జోనల్ ఛైర్మన్ వై.ప్రణయ్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాకెట్ల గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఆయా పనులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శివమ్మ, ఎపిపి చంద్రమ్మ, జడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎపిపి నరసింహులు, కమ్మ, కురుబ కార్పొరేషన్ల డైరెక్టర్లు తేజోనాథ్, గోవిందు, పెన్నఅహోబిలం మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, దయ్యాలు నాగరాజు, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, బాబు, సురేష్, సీనానాయక్, ఓంప్రకాష్, శ్రీనివాసులు, రామిరెడ్డి, ఓబయ్య, నారాయణ, సుంకమ్మ, నాగరాజు, మధు, వడ్డే ఆంజనేయులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం

బొమ్మనహాల్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న అకౌంటెంట్ నీలకంఠనాయుడు అనంతపురం నగరంలోని వైద్య కళాశాలకు బదిలీపై వెళ్లారు. ఇతడిని గురువారం ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది దుశ్శాలువా తో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ విధి నిర్వహణలో, ఉద్యోగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందించడంలో బాధ్యతగా కృషి చేసినందుకు వైద్య సిబ్బంది తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు వివేకానంద, డాక్టర్ ఈరన్న, డాక్టర్ సంధ్య, డాక్టర్ మహ్మద్‌సుల్తానా, డాక్టర్ రఫీసుల్తానా, గీతాభార్గవి, డాక్టర్ కుమార్‌రాజా, సూపర్‌వైజర్లు, యుడిసి చిరంజీవి, ఇన్‌ఛార్జి యుడిసి అశోక్, నర్సులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

గుత్తి : పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు అరవింద్, జస్వంత్, ఇజాజ్ విద్యార్థులు ద్విచక్ర వాహనంలో గుత్తికి వస్తుండగా బైకు అదుపుతప్పి బోల్తా పడింది. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దుర్గాంబ ఫార్మర్స్ వేర్‌హౌస్‌లో చోరీ

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని డొనేకల్ గ్రామ శివారులో ఉన్న దుర్గాంబ ఫార్మర్స్ వేర్‌హౌస్‌లో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు డొనేకల్ రమేష్ తెలిపిన వివరాల మేరకు వేర్‌హౌస్‌కు ఆఫీస్ రూమ్ తాళాలు పగలగొట్టి స్టిచ్చింగ్ మిషన్, క్యాష్ అకౌంటింగ్ మిషన్, వే బ్రిడ్జ్ కాటా కంప్యూటర్, ఇన్వర్టర్, యుపిఎస్, 5, 10 కిలోల కాటా మిషన్లు 4, ఎక్సైడ్ బ్యాటరీ, జిరాక్స్ మిషన్, కంప్యూటర్, ఫ్యాన్, తదితరాలను దోచుకెళ్లినట్లు తెలిపారు. దీంతో సుమారు రూ.3లక్షల వరకూ నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. ఘటనపై విడపనకల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

దేవునిఉప్పలపాడు సర్పంచి అభ్యర్థిగా కాటమయ్య



పెద్దపప్పూరు : మండలం పరిధిలోని దేవుని ఉప్పలపాడు గ్రామ పంచాయతీ సర్పంచి వైసిపి అభ్యర్థిగా కేశగాని కాటమయ్య గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈయనకు పోటీగా రెండో అభ్యర్థిగా తలారి అశ్వర్థ నామినేషన్ దాఖలు చేశారు. దీంతో గ్రామంలో ఉత్కంఠ నెలకొంది. ఈనేపథ్యంలో వైసిపి నాయకులు చర్చలు జరిగి చివరి నిమిషయంలో ఉత్కంఠకు తెర దించుతూ కాటమయ్యతో నామినేషన్ దాఖలు చేయించారు. రెండో నామినేషన్ వేసిన అశ్వర్థతో రేపు ఉపసంహరించుకోనున్నట్లు వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, జడ్పిటిసి రమాదేవి తెలిపారు.

'శ్రీచైతన్య'లో ఫ్రెషర్స్ డే వేడుకలు

అనంతపురం : నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీచైతన్య రెసిడెన్షియల్ పాఠశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఎజిఎం సుబ్బారెడ్డి, వన్‌టౌన్ సిఐ రెడ్డప్ప మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఓర్పు, నేర్పులతో ప్రయోజిత విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థులు జ్ఞానాన్ని పుస్తకానికే పరిమితం చేయకుండా సాంకేతికతతో కూడిన విద్య గురించి ఆటపాటలతో బాల్యం నడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సమీనాఖాన్, అకడమిక్ కోఆర్డినేటర్ నాగభూషణ, వైస్ ప్రిన్సిపల్ షమీనా, డీన్ సత్యనారాయణ, కో డీన్ చంద్రమోహన్, పాఠశాల బృందం పాల్గొన్నారు.

ఉరవకొండ ప్రభుత్వ ఖాజీగా టి.మహమ్మద్ యూసుఫ్

ప్రభుత్వ ఖాజీగా నియామక ఉత్తర్వులను అందుకుంటున్న టి.మహమ్మద్ యూసుఫ్

ఉరవకొండ : మండల ప్రభుత్వ ఖాజీగా పట్టణానికి చెందిన టికె.అబ్దుల్‌హాయ్ కుమారుడు టి.మహమ్మద్ యూసుఫ్‌ను నియమించారు. ఈమేకరు గురువారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని స్వగృహంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ వైసిపి నాయకులు మస్తాన్‌వలి, జిలాన్, రహంతుల్లా, నూర్, దిద్దెకుంట సూరి, మాలాపురం కేశన్న, రేణుమాకులపల్లి రామకృష్ణ, వెలిగొండ బుషప్ప, వాల్మీకి యువ నాయకులు చుక్కా రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుందరాచారి జయంతి

గుత్తి : ఎపి రాష్ట్ర గీతమైన మా తెలుగు తల్లి మల్లెపూదండ రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతి వేడుకలు గుత్తిలో గురువారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా పట్టణంలోని ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం కార్యాలయంలో తెలుగు తల్లి, సుందరాచారి చిత్రపటాలను ఉంచి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు, ఉపాధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి రామ్మోహన్, సహాయ కార్యదర్శి నారాయణరెడ్డి, కోశాధికారి ఫక్రుద్దీన్, నాయకులు హాసన్, మహమ్మద్, షేక్షావలి, మద్దిలేటి పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

అనంతపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంటే మానసిక వికాసం కలుగుతుందని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత అన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా వినియోగదారుల కమిషన్ ప్రాంగణంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కలుపు మొక్కలు, చెత్తను తొలగించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కమిషన్ అధ్యక్షురాలు శ్రీలత, సభ్యులు గ్రేస్ మేరీ, బి.గోపీనాథ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సున్నా వడ్డీ పంపిణీ

గుంతకల్లు రూరల్ : జగనన్న మహిళలకు ఇచ్చే సున్నా రాయితీ వడ్డీ సొమ్మును ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు ఎపిఎం వీరస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11,600 గ్రామ సంఘాలకు రూ.1.58 లక్షలు అందజేయనున్నట్లు తెఇపారు.

మతోన్మాద విధానాన్ని నిరసిస్తూ ర్యాలీ

ఉరవకొండ : మణిపూర్‌లో జరిగిన మతోన్మాత విధానాన్ని నిరసిస్తూ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్ల అసోసియేషన్ వెల్ఫేర్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధాన జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి ఉరవకొండ అప్పర్ సర్కిల్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయాల వరకూ వచ్చి వినతిపత్రం ఈ కార్యక్రమంలో యుసిపిఏడబ్ల్యు అధ్యక్షులు, పాస్టర్లు జాన్, ఇశ్రాయే, సుధాకర్ రామాంజనేయులు, క్రైస్తవ సంఘం సభ్యులు కె.నాగరాజు, శేఖమ్మ, వన్నూరుస్వామి, ఉమాదేవి, వెంకటేశులు, శాంతకుమారి, వనజాక్షి, వరలక్ష్మి, దేవి, వెంకటలక్ష్మి, రూతు, రూప, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

కుందుర్పి : స్థానిక ఎస్సీ కాలనీ పాఠశాలలో గురువారం బదిలీ ఉపాధ్యాయులను హెచ్ఎం ఆంజనేయులు, స్కూల్ కమిటీ ఛైర్మన్ వరలక్ష్మినాగేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ తిప్పేస్వామి మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, రేవన్న పలువురు విద్యార్థులు గురుకుల, నవోదయ పాఠశాలలకు ఎంపిక కావడంలో ప్రముఖ పాత్ర పోషించారని కొనియాడారు. సర్పంచి మారుతీశ్వరిరామ్మూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో వంద లాది మంది విద్యార్థులను ప్రయోజకులను చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, వార్డ్ మెంబర్ వైబి దుర్గమ్మ, స్కూల్ కమిటీ ఛైర్మన్ వరలక్ష్మినాగేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేలంపాట వాయిదా

రాయదుర్గం : పురపాలక సంఘానికి చెందిన కూరగాయల మార్కెట్ మొదటి అంతస్తులో షాపుల వేలం పాటను వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వేలంపాటదారులు ఎవరూ పాల్గొనక పోవడం వల్ల వేలం పాట వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ నెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు తిరిగి షాపుల వేలం పాటలు నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. కాగా షాపుల వేలం పాట వాయిదా పడటం ఇది రెండవసారి.

మున్సిపల్ కాంప్లెక్స్ పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలి

అనంతపురం కార్పొరేషన్ : కార్పొరేషన్ పరిధిలోని టవర్‌క్లాక్ వద్ద ఉన్న కొత్త మున్సిపల్ షాపింగ్ కాప్లెక్స్ పరిశుభ్రతకు చర్యలు తీసుక్వోఆలని కమిషనర్ భాగ్యలక్ష్మికి ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ డివిజినల్ సభ్యులు పోలా వీరాంజినేయులు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ పరిశుభ్రతతోపాటు సెక్యూరిటీ గార్డ్‌ను నియమించాలని కోరారు.

కుర్ని శెట్టి సమాజాభివృద్ధికి కృషి

ఎస్ఎస్ గ్రూప్ అధినేత డి.మల్లికార్జున

ప్రజాశక్తి-డి.హీరేహాల్

మండల పరిధిలోని కుర్ని శెట్టి సమాజాభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఎస్ఎస్ గ్రూప్ అధినేత డి.మల్లికార్జున తెలిపారు. మండలంలో డాక్టరేట్ సాధించిన వారికి కుర్ని శెట్టి సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం(నేడు) స్థానిక నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్క కుర్ని శెట్టి సమాజ సభ్యులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి కుర్ని సమాజ గురువులు శివశంకర్‌శివాచార్యస్వామి, హీరేహాల్ వాస్తవ్యులు హొస్పేట్ ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవప్ప హాజరవుతారని వారు తెలిపారు. సన్మాన కార్యక్రమం అనంతరం మండలంలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామని ఎస్ఎస్ గ్రూప్ అధినేత మల్లికార్జున తెలిపారు.

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE, (JFCM COURT) ANANTAPURAM
0.S.NO.169/2022

Between:-
S.Jareena ...Plaintiff
V/S
S.Siva Prasada Rao ...Defendant

To,
S.Siva prasada Rao S/o S.Lakshminarayana Rao, MSR Enclave, R/o D.No.11/924, 3rd Floor, Aravind Nagar, Anantapuramu Town.
Shop Address: LASER HAIR REMOVAL, Ruthvika Towers, Mythri Hospital Backside, Kamalanagar, Anantapuramu, Mob: 9885853141

ఇందుమూలముగా ప్రతి వాదికి తెలియజేయడమేమనగా పై దావా లోని వాది మీ పైన బాకీ వసూలు నిమిత్తం పై దావాను పై కోర్టులో మీపై దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో మీ హాజరు నిమిత్తము 23/08/2023వ తేదిన వాయిదా ఉన్నది. సదరు తేది 23/08/2023వ తేదిన పై కోర్టులో ఉదయం 10:30 గంటల నుండి కోర్టు ముగియు లోపల కుద్దున గానీ, వకీలు ద్వారా గాని హాజరై సదరు దావా పై ఆక్షేపణలు తెలియజేసుకోవచ్చును. లేని యెడల మీ పరోక్షమున పై దావా తీర్మానించబడును.

జి.రామ్‌గోపాల్, అడ్వకేట్, అనంతపురం.

నులిపురుగులను నివారిద్దాం

నివారణ దినోత్సవంలో వక్తలు

గుంతకల్లు మండలంలో విద్యార్థులకు నులిపురుగులు వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

చిన్నారుల్లో నులిపురుగుల నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మెడికల్ ఆఫీసర్ నవీన్ తెలిపారు. నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రతతోనే పిల్లలకు నులిపురుగులు సంక్రమిస్తాయన్నారు. ముఖ్యంగా గోళ్లు పెరిగినప్పుడు కత్తిరించుకోవాలన్నారు. అలా చేయకపోవడం వల్ల వాటిలో మట్టి చేరి అనారోగ్యానికి కారణం అవుతుందన్నారు. విద్యార్థులు బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ఎం.సుధాకర్, ఆశావర్కర్, అంగన్‌వాడీ మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ భాలికల విద్యాలయంలో చిన్నారులకు నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణ్‌కుమార్ పిల్లల ఎదుగుదలకు నులి పురుగులు అడ్డంకుగా ఉంటాయన్నారు. కావున పిల్లలకు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ఎస్ఒ బి.బయమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు శర్మాస్‌వలి, నాగరాత్న, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో సర్పంచి వరలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థినులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు దయాకర్, కెజిబివి ప్రిన్సిపాల్ లీమరోజ్, ఎంపిహెచ్ఇఒ నాగేశ్వరయ్య, పిహెచ్ ఎన్ తులసమ్మ, సూపర్‌వైజరు వెంకటరత్నమ్మ, ఎఎన్ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

నార్పల : నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నార్పల, బి.పప్పూరు ప్రాథమిక వైద్యశాలల వైద్యులు ప్రవీణ్‌కుమార్, రవిశంకర్ ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ ఇఒ మల్లికార్జున, సూపర్‌వైజర్ శ్రీరాములు, ఎఎన్ఎంలు, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : నులి పురుగులను నివారించి చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి తెలిపారు. నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విడపనకల్లు మండలం పరిధిలోని పాల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అరుణకుమారి ఆధ్వరాయలో ప్రాథమిక పాఠశాల, గడేకల్ ఆరోగ్య ఉపకేంద్రాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, డిష్ వెంకటేష్, షణ్ముఖగౌడ్, దాసరి వెంకటేష్, సుంకన్న, శంకర్‌గౌడ్, రాముడు, రామాంజనేయులు, వైద్యసిబ్బంది శ్రావణి, సుగుణ, ఫర్జాహన్, ఉపాధ్యాయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నెలో అవగాహన కల్పిస్తున్న మండల వైద్యురాలు షమీం తాజ్

గార్లదిన్నె : జాతీయ నులిపురుగుల నివారణలో భాగంగా గురువారం మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి డాక్టర్ షమీంతాజ్ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తేజోష్ణ, వైద్యాధికారులు గౌతమి, దిలీప్‌కుమార్, మండల విద్యాధికారులు తారా చంద్రానాయక్, వెంకటరమణనాయక్, ప్రధానోపాధ్యాయులు సుంకన్న, సిహెచ్ఒ లోకనాథ్, పాల్గొన్నారు.

పూడికతీత పనులపై దృష్టి సారించాలి

మేయర్ మహమ్మద్ వసీం

పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

అనంతపురం కార్పొరేషన్ : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలో ఎక్కడా మురుగునీరు రోడ్డుపైకి రాకుండా కాలువల్లో పూడికతీతపై దృష్టి సారించాలని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. గురువారం నగరంలోని సప్తగిరి సర్కిల్ కూడలిలో మురుగు కాలువల్లో చేపట్టిన పూడికతీత పనులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు మురుగు కాలువలు పొంగి రోడ్లపై ప్రవహించి బురద పేరుకుపోయే అవకాశం ఉంటుందన్నారు. కావున డోజర్లను ఏర్పాటు చేసి కాలువల్లో బురద తొలగింపు పనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్ భూషణ్, ఎంహెచ్ఒ గంగాధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.